వైభవంగా కల్యాణ మహోత్సవాలు



కోకాపేటలో మల్లన్న స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: శ్రీ భ్రమరాంబ, క్యాతమ్మ, మల్లిఖార్జున స్వామి కల్యాణాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట, వట్టినాగుపల్లి గ్రామస్తులు ఉదయాన్నే గంపలతో సామూహికంగా ఆలయాలకు చేరుకున్నారు. స్వామివార్లకు అభిషేకం, అనంతరం ఒగ్గుకథలు, కల్యాణాన్ని నిర్వహించారు. సాయంత్రం అగ్నిగుండాలు తొక్కడం, గొలుసులు తెంపడం తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఆయా గ్రామాల ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కోకాపేట ఉత్సవాల్లో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖాయాదగిరి, కౌన్సిలర్ జి.శివారెడ్డి,



వట్టినాగుపల్లిలో ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ సర్పంచ్‌లు, భక్తులు

మాజీ ఎంపీపీ తలారి మల్లేశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి, వట్టినాగులపల్లి మాజీ సర్పంచ్‌లు స్వరూపానగేశ్‌యాదవ్, అనంతరెడ్డి, కౌన్సిలర్ బి.యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీని ఓడిస్తేనే ఎస్సీ వర్గీకరణ'

శంషాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడిస్తేనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమవుతుందని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. త్వరలో నిర్వహించనున్న మాదిగల జోడో యాత్ర చైతన్యవంత కార్యక్రమంలో భాగంగా ఆదివారం శంషాబాద్‌కు చేరుకున్న ఆయన అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గుంటి ప్రవీణ్‌కుమార్ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం పిడమర్తి రవి మాట్లాడుతూ.. మాదిగల రిజర్వేషన్‌కు బీజేపీ పూర్తి వ్యతిరేకమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 30 ఏళ్ల వర్గీకరణ కల బీజేపీ ఓడించడంతోనే నెరవేరుతుందన్నారు. మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో పాటు ఎస్సీ రిజర్వేషన్‌ను పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెద్దగండు శ్రీధర్, చిన్నగండు అనిరుధ్, వెంకటేశ్, గద్ద యాదయ్య, మల్లికార్జున్, బొర్రెల్లి సురేశ్, ఉపేందర్, నరిసింహరావు, ప్రసాద్, మహేశ్, నరేశ్, రమేశ్, గణేశ్, మహేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి

గోల్డెన్ టెంపుల్ వార్షిక బ్రహ్మోత్సవాలు షురూ..



సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

మణికొండ: శ్రీ శృంగేరి జగద్గురు మహా సంస్థానం ఆధీనంలోని మణికొండ మున్సిపాలిటీ, సెక్రటేరియట్ కాలనీలోని శ్రీ శారదా చంద్రమౌళీశ్వర, వేంకటేశ్వర స్వామి వార్ల ఆలయం అష్టాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పలు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

నేటి పూజలు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఉదయం 8 గంటలకు సూర్య నమస్కారాలు, చండీ పారాయణం, శ్రీకామేశ్వరీ సమేతా చంద్రమౌళీశ్వరస్వామి వారికి అష్టోత్తర శత కలశాభిషేకం, అనంతరం కల్యాణం, సాయంత్రం 4 గంటలకు గణపతి హోమం, ఆయుష్య హోమం, రుద్రహోమం, సాయంత్రం 6 గంటలకు శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారి దివ్య కల్యాణం ఉంటాయని శృంగేరి శారదాపీఠం గౌరవ ప్రతినిధి కశ్యప్ చతుర్వేది తెలిపారు.

ముగిసిన సమ్మక్క సారలమ్మ జాతర

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ మానస హిల్స్‌లోని గుట్టపై రెండు రోజుల పాటు నిర్వహించిన సమ్మక్క సారలమ్మ జాతర ఆదివారం ముగిసింది. స్థానికులతో పాటు జంట నగరాలకు చెందిన వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవార్లకు బంగారం (బెల్లం) ను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీరాములు ముదిరాజ్ కుటుంబ సభ్యులు ఉదయం సమ్మక్క, సారలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సమ్మక్క సారలమ్మను వన ప్రవేశం చేయించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి గ్రీన్ విచ్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీనివాస్ ఆదివార ఓ ప్రకటనలో తెలిపారు. పల్లెచెరువు, గుమ్మడి వెంకట్ రెడ్డినగర్ , మిలాన్ నగర్ , ఆశామబాద్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ప్రజావాణి...

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం (నేడు) ఉదయం 10 గంటలకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉప కమిషనర్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జీహెచ్ఎంసీలోని అన్ని విభాగాల అధికారులు పాల్గొని ఫిర్యాదులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. రాజేంద్రనగర్, అత్తాపూర్, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ల ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయాలని కోరారు.

నేటి నుంచి సీబీఐటీలో 'సుధీ-2024'

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో వార్షికోత్సవ టెక్నికల్ ఫెస్ట్ సుధీ-2024 ను ఈ నెల 26, 27 తేదీల్లో నిర్వహించనున్నట్లు సుధీ చైర్మన్ ప్రొఫెసర్ జి. ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు ముఖ్య అతిథిగా వైఎంఆర్ఎల్ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. బాలమురళీ కృష్ణన్, గౌరవ అతిథిగా ఉస్మానియా యూనివర్సిటీ డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఇంజినీరింగ్ సీనియర్ ప్రొఫెసర్ ఆర్. కుమార్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. రెండురోజుల పాటు 13 విభాగాల విద్యార్థులు తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శిస్తారని తెలిపారు.

శ్రీ గాయత్రీ ఈ-టెక్నో పాఠశాలలో సైన్స్ ప్రదర్శన



మైలార్‌దేవ్‌పల్లి: మధుబన్‌కాలనీలోని శ్రీ గాయత్రీ ఈ-టెక్నో పాఠశాలలో ఆదివారం నిర్వహించిన సైన్స్ ప్రదర్శనను చైర్మన్‌మధుసూదన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన న్యూట్రిషన్ డైట్, సెన్సార్ టెక్నాలజీ వంటి వివిధ రకాల పరికరాలను ప్రదర్శించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకు, వారి మేధస్సును పెంచే విధంగా చదువుతో పాటు ప్రాక్టికల్‌గా చేసి వివరించడం, లీడర్‌షిప్ తనం పెంచే విధంగా యేటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పేద విద్యార్థులకు పాఠశాల పరంగా సహాయసహకారాలు అందిస్తున్నామని తెలిపారు. ట్రస్మా సంస్థ అధ్యక్షుడు ప్రభాకర్‌చారి, కోశాధికారి రజనీకాంత్, డైరెక్టర్ నయూముద్దీన్, శ్రీహరి, సీఈవో సర్వేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

గురుద్వారాలో ఎంపీ పూజలు



రాజేంద్రనగర్: అత్తాపూర్ కిషన్‌బాగ్‌లోని గురుద్వారాను చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్ రెడ్డి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా గురుద్వారా కమిటీ సభ్యులతో పాటు స్థానిక సిక్కు సోదరులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన ప్రార్థనల్లో రంజిత్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే స్థానికులతో సమావేశమయ్యారు.

ఉందానగర్ రైల్వేస్టేషన్‌కు మహర్దశ..!

- 'అమృత్ భారత్ రైల్వేస్టేషన్' పథకానికి ఎంపిక
- నేడు వర్చువల్‌గా పనులు ప్రారంభించనున్న పీఎం మోదీ
- ప్రయాణికులకు అందనున్న మరింత మెరుగైన సేవలు





వర్చువల్ కార్యక్రమానికి చేసిన ఏర్పాట్లు

శంషాబాద్: ఉందానగర్ (శంషాబాద్) రైల్వేస్టేషన్‌కు మరింత మహర్దశ పట్టనున్నది. ఇటీవలే కొంత ఆధునికీకరణకు నోచుకున్న ఈ స్టేషన్‌ను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా 'అమృత్ భారత్ రైల్వేస్టేషన్' పథకంలో భాగంగా ప్రపంచ స్థాయి ప్రమాణాలను ఈ స్టేషన్‌లో నెలకొల్పనున్నారు. దేశవ్యాప్తంగా ఈ పథకాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం (నేడు) ప్రారంభించనున్నారు.

రెండేళ్లుగా..

ఉందానగర్ రైల్వేస్టేషన్ నిజాం కాలంలో ప్రారంభమైంది. గత రెండేళ్లుగా ఇందులో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. గతంలో ఉన్న భవనాన్ని పూర్తిగా తొలగించి నూతన భవనాలు, ప్లాట్‌ఫాంలను విస్తరించడంతో పాటు ప్రయాణికులు దాటే పై వంతెనలను నిర్మించారు. డిజిటల్ బోర్డులు సైతం ఏర్పాటు చేశారు. ఇటీవలే ఫలక్‌నుమా నుంచి మహబూబ్‌నగర్ వరకు విద్యుదీకరణ కూడా పూర్తి కావడంతో లింగంపల్లి నుంచి ఫలక్‌నుమా వరకు మాత్రమే ఉన్న ఎంఎంటీఎస్ సేవలను శంషాబాద్ వరకు పొడిగించారు.

ఇంకా నెలకొన్న సమస్యలు..

శంషాబాద్ రైల్వేస్టేషన్ మీదుగా అనేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు రాకపోకలు సాగిస్తున్నా.. ఇప్పటివరకు స్థానికంగా ఆపడం లేదని శంషాబాద్ వాసులు పలుమార్లు వినతి పత్రాలు అందజేశారు. రైల్వే శాఖ మంత్రులు ఉందానగర్ స్టేషన్‌ను సందర్శించినప్పుడు వారి దృష్టికి సమస్యలను తీసుకెళ్లారు. ఇప్పుడు అమృత్ పథకంలో భాగంగా ఈ సమస్య కూడా పరిష్కారం అవుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సంక్లిష్టంగా పేరు మార్పు..

ఉందానగర్ పేరును శంషాబాద్ రైల్వేస్టేషన్‌గా మార్చాలని స్థానికులు అనేకసార్లు కేంద్రమంత్రులు, రైల్వే ఉన్నతాధికారులకు విన్నవించినా అది మాత్రం పరిష్కారం కాలేదు. దానికి కారణం నార్త్ సెంట్రల్ రైల్వే పరిధిలోని ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో గల ఆగ్రా జిల్లాలో శంషాబాద్ పేరిట మరో రైల్వే స్టేషన్ ఉంది. దీంతో ఇక్కడి స్టేషన్ పేరు ఇప్పటికీ ఉందానగర్‌గానే కొనసాగుతోంది.

కబ్జాలో రైల్వేరోడ్డు..

పట్టణంలోని బేగంగార్డెన్, ఆర్అండ్‌బీ అతిథిగృహం పక్క నుంచి జాతీయ రహదారి గుండా రైల్వేస్టేషన్ వరకు ఉన్న రైల్వే రోడ్డు వెంట కొందరు ప్రైవేట్ వ్యక్తులు ఏళ్లుగా దందా సాగిస్తున్నారు. ప్రైవేట్ పార్కింగ్‌తో పాటు కూరగాయల విక్రయాలు, ఇతర దుకాణాలు కొనసాగిస్తున్నారు. ఇప్పుడు అమృత్ పథకంలో రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయడంతో పాటు ఈ రహదారి వైపు ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదిస్తున్నారు. దీంతో జాతీయ రహదారికి రైల్వేస్టేషన్ అనుసంధానంగా మారనుండడంతో ప్రయాణికులు ఇక సులభంగా చేరుకునే అవకాశముంటుంది.

కేంద్రం చొరవతోనే ఆధునీకీకరణ..



కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతోనే ఉందానగర్ (శంషాబాద్) రైల్వేస్టేషన్ ఆధునికీకరణను నోచుకుంటున్నది. ఇప్పటికే రేల్వేస్టేషన్ కొంతవరకు అభివృద్ధి చెందింది. దీంతో ఎంఎంటీఎస్‌లు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇప్పుడు అమృత్ పథకంలో చేర్చడం అభినందనీయం. భవిష్యత్‌లో ప్రపంచ స్థాయి ప్రమాణాలు గల రైల్వేస్టేషన్ స్థానికులు అందుబాటులోకి రానుండడం సంతోషకరమైన విషయం.

–మహిపాల్‌రెడ్డి, కిసాన్‌మోర్చా మండలాధ్యక్షుడు

ఆట స్థలాలు అవసరం: ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



ఆట స్థలాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, చైర్మన్ నరేందర్

మణికొండ: అపార్ట్‌మెంట్లు, కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న మున్సిపాలిటీల్లో పిల్లలు, పెద్దలు ఆడుకునేందుకు ఆట స్థలాలు ఎంతో అవసరమని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ, అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నంబర్-6లో పి.సత్యనారాయణ ఏర్పాటు చేసిన వన్ మోర్ గేమ్ క్రీడా ప్రాంగణాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలకాపూర్ టౌన్‌షిప్‌లో ప్రభుత్వం, మున్సిపాలిటీ పరంగా పార్కులు, ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ప్రైవేట్‌గా ఇలాంటి ఆట స్థలాలు వస్తే పిల్లలు ఇష్టంగా ఆడుకుంటారన్నారు. కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్, బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ తలారి మల్లేశ్, నాయకులు జయరాజ్, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సొంత ఖర్చుతో బోర్‌వెల్ ఏర్పాటు

డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి ఉదారత



బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి ఉదారత చాటుకున్నారు. కార్పొరేషన్ పరిధిలోని 15వ డివిజన్ హైదర్షాకోట్ పాత గ్రామం ప్రాథమిక పాఠశాలలో సొంత ఖర్చులతో ఆదివారం బోర్ వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రజలకు నీటి కష్టాలు రాకుండా ఉండేందుకే ముందస్తు చర్యలు తీసుకుంటున్నానన్నారు. ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు. అలాగే కార్పొరేషన్ పరిధిలో తాగునీటికి ఇబ్బందుల్లేకుండా అధికారులతో సమీక్షా సమావేశాలు సైతం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఖాళీ జాగా.. వేసేయి పాగా..!

- ప్రభుత్వ స్థలాల కబ్జాకు యత్నం
- గతంలోనే అడ్డుకున్న అధికారులు
- మళ్లీ రెచ్చిపోతున్న భూబకాసూరులు



ప్రభుత్వ స్థలంలో బోరు వేయిస్తున్న కబ్జాదారులు

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో ప్రభుత్వ స్థలాలు ఖాళీగా కనిపిస్తే చాలు.. కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు కొందరు అక్రమార్కులు. గతంలో కొందరు నాయకులు రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో సర్వే నంబర్- 156 లో స్థలాన్ని కబ్జా చేసి బేస్‌మెంట్ కట్టి నకిలీ పత్రాలు సృష్టించి విక్రయించారు. ఈ విషయం తెలుసుకున్న అప్పటి తహసీల్దార్, ఆర్డీవో కబ్జాకు గురైన స్థలంలో వెలిసిన నిర్మాణాన్ని జేసీబీతో కూల్చి వేయించారు. ఇప్పుడు నూతన ఆర్డీవో, తహసీల్దార్ రావడంతో మళ్లీ కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. కొందరు రాజకీయ నాయకుల అండదండాలతో భూ కబ్జాలు చేసి అమాయక ప్రజలకు తక్కువ ధరకు అంటగట్టి చేతులు దులుపుకుంటున్నారు. ఇప్పటికే డివిజన్‌లో అనేక ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమైనా.. ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సర్వే నంబర్ 156లోని పద్మశాలీపురం, టీఎన్‌జీవోస్ కాలనీకి మధ్యనున్న హౌసింగ్ బోర్డ్ కాలనీలో కొంత ప్రభుత్వ స్థలం ఉన్నది. అయితే ఆదివారం సెలవు కావడంతో అందులో బోర్ వేసి కొందరు కబ్జాకు పాల్పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

భూకబ్జాలను అడ్డుకోవాలి..



మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని సర్వే నంబర్-156 లోని ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అ వుతున్నది. తహసీల్దార్, ఆర్డీవో బదిలీ కావడంతో కబ్జాదారులు ఇదే అదునుగా దర్జాగా ప్రభు త్వ స్థలంలో బోరు వేసి కబ్జాకు యత్నిస్తున్నారు. ఈ స్థలాల్లో నిర్మించినా వాటిని గతంలోనే అధికారులు కూల్చివేశారు. అయినా ఇప్పుడు మళ్లీ చేపడుతున్నారు. అధికారులు సత్వర చర్యలు తీసుకొని ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి.

–వనంపల్లి జైపాల్‌రెడ్డి , రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి

ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

సీఆర్‌పీఎఫ్ డీఐజీ ఉదయ్‌కుమార్



వైద్య శిబిరాన్ని ప్రారంభించిన డీఐజీ ఉదయ్‌కుమార్, పక్కన డాక్టర్ ప్రభుకుమార్

మణికొండ: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సీఆర్‌పీఎఫ్ డీఐజీ ఉదయ్‌కుమార్ సూచించారు. మణికొండ మున్సిపాలిటీ శ్రీలక్ష్మీ కాలనీలోని డాక్టర్ ప్రభుకుమార్ చల్లగాలి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించిన ఉచిత లివర్ పరీక్షలు, మందుల పంపిణీ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోషకాహారం తీసుకోవడంతో పాటు శారీరక వ్యాయామం చేయాలన్నారు. డాక్టర్ ప్రభుకుమార్ మాట్లాడుతూ చాలామంది తిన్న ఆహారం అరిగించడంలో లివర్ శ్రమపడడంతో ఫ్యాటీ లివర్, లివర్ సిరోసిస్, జాండీస్ లాంటి సమస్యలు వస్తున్నాయన్నారు. వాటిని సకాలంలో గుర్తించి మందులు వాడుతూ, వ్యాయామం చేస్తే ఎక్కువ కాలం జీవిస్తామన్నారు. అధునాతన ఫైబ్రోస్కాన్ యంత్రంతో పరీక్షలు చేసి కచ్చితమైన రిపోర్టులు, మందులను 300 మంది రోగులకు అందించామని చెప్పారు.

ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

రాజేంద్రనగర్: అత్తాపూర్ డివిజన్ పరిధిలోని హుడాకాలనీలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వనం శ్రీరాం రెడ్డి ప్రారంభించారు. దీనికి రోగుల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యోదా లైఫ్ లైన్ డయాగ్నోస్టిక్ సెంటర్ ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు బంగి శ్రీనివాస్, శివకుమార్, భారత్ సారంగి, శంకర్, మహేందర్ రెడ్డి, రితేశ్, గంగాధర్, పవన్ భారతి, వైద్యులు సేనుసోని, వీణ గోయల్, దీపక్ గోయల్ పాల్గొని రోగులను పరీక్షించి కొలెస్ట్రాల్, బీపీ, షుగర్, బాడీ ఫ్యాట్, బీఎంఆర్ తదితర పరీక్షలు నిర్వహించారు.

మహిళా శక్తి సమ్మేళనం



శంషాబాద్: ఆర్ఎస్ఎస్ భాగ్యనగర్ విభాగ్ ఆధ్వర్యంలో పట్టణంలోని పద్మావతి గార్డెన్‌లో ఆదివారం మహిళా శక్తి సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రంగాలకు చెందిన మహిళా ప్రముఖులు హాజరై విద్య, ఉపాధి రంగాల్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. మహిళలు వంటింటికే పరిమితమన్న వాదనలు కొట్టిపారేస్తూ వివిధ రంగాల్లో రాణిస్తున్న వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు మంచి భవిష్యత్తుకు పునాది వేస్తాయన్నారు. ఈ సందర్భంగా చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. పద్మశ్రీ శోభారాజు, ఎల్. ఉజ్వల, డాక్టర్ స్వప్న, ఉమాదేవి, సునంద, స్ఫూర్తి, ప్రసన్నలక్ష్మీ, సురక్ష పాల్గొన్నారు.